


***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**డియర్ మిస్టర్ బిల్ క్లింటన్,**

గ్రీటింగ్స్. ఐ సేల్యూట్ ది స్టార్స్ అండ్ స్ట్రయిప్స్.

నా గురించి వాణి మీకు ఇప్పటికే చాలా ఉత్తరాలు రాసింది కాబట్టి మీకు విషయాలన్నీ తెలుసు. మళ్ళీ అవే వివరంగా ఎన్‌క్లోజర్స్‌లో ఇస్తున్నాను.

జూలై 4, 1776లోని 'డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్' ఇలా మొదలవుతుంది.

"We hold these truths to be selfevident that alla men are created eQual, that they are endowed by their creator with certain indenible rights, that among these are life, liberty and the pursuit of happiness"

"నేను ఇంకో నెలలో అమెరికా వచ్చి వాణిని వివాహం చేసుకోలేకపోతే నా జీవితంలో ఆనందాన్ని కోల్పోతాను. ఆ తర్వాత బతకడం సమయాన్ని వృథా చేయడమే అవుతుంది. కాబట్టి ఆత్మహత్యే నాకు శరణ్యం అవుతుంది."

ప్రతి మనిషీ తన ఆనందం కోసం ప్రయత్నించడం జన్మ హక్కుగా చెప్పే డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్ పుట్టిన దేశానికి చెందిన మీరు, ఈ సహాయం చేయడంలో ఔచిత్యం ఉందని నమ్మి ఈ లెటర్‌ని రాస్తున్నాను.

25 కోట్ల ఇరవై లక్షల జనాభాగల అమెరికాకి నేనొక్కడ్నీ భారం అవబోను. కేలిఫోర్నియా రాష్ట్రంలో సగం జనాభా ఇల్లీగల్ ఇమ్మిగ్రెంట్సే మెక్సికోకి చేరుకుని టెక్సాస్ - మెక్సికన్ బార్డర్‌లో ఎల్‌పోసో దగ్గర మెక్సికన్ ఎలియన్స్‌లా కాలినడకన అమెరికాలోకి దొంగతనంగా ఎంటరవడం ఇష్టంలేక లీగల్ మెథడ్‌ని నేను వాణి కోరుకుంటున్నాం. అలా ఇల్లీగల్‌గా ఏటా అమెరికాకి వచ్చే ఎనిమిదిలక్షలమందిలో నేనొకడు కావడం ఇష్టంలేదు నాకు.

దయచేసి మీరు మాకు మానవతా దృష్టితో న్యాయం చేకూర్చవలసిందిగా కోరుతున్నాను. నేను జీవించివుండాలో, కూడదో మీరే నిర్ణయించగలరు. వాణిని చేరుకోలేకపోతే నేను జీవించి వృథా.

***యువర్స్ సిన్సియర్లీ,***

***ముకుందం.***

25

ఏ ప్రజా స్వామ్యంలోనైనా బలమైన ఆయుధం ప్రొటెస్ట్. దాన్నే ఎంచుకుంది వాణి. లైబ్రరీకి వెళ్ళి అడిగింది లైబ్రేరియన్‌ని.

"ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికాకి తమ ప్రొటెస్ట్‌ని ఏయే మార్గాల్లో ఇంతదాకా వ్యక్తపరిచారో నాకు సమాచారం కావాలి"

ఆ సాయంత్రం అనేక పుస్తకాల్లోంచి తీసిన జిరాక్స్ కాపీలను నీట్‌గా స్టేపిల్ చేసి ఇచ్చింది లైబ్రేరియన్.

ఆ రాత్రి వాటన్నిటినీ చదివింది. చాలా భాగం సిల్లీగా తోచాయి వాణికి.

దేశ ఆర్థిక వ్యవస్థ పాడైనందుకు ప్రొటెస్ట్‌గా 99 సెంట్లు ప్రెసిడెంట్‌కి మని ఆర్డరు చేయడం, తాము ప్రొటెస్ట్ చేసే విషయం మీద లక్షపోస్టు కార్డులు రాయించి పంపడంలాంటి పని. చివరికి స్టేసి ఎబ్ని గురించి చదివాక వాణి తను వెదికే సమాచారం అదే అనుకుంది. వెంటనే పెన్, పేడ్ అందుకుని ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికాకి ఉత్తరం మొదలు పెట్టింది.

*డియర్ మిస్టర్ బిల్‌క్లింటన్.* *సేనోజే*

నా ఫియాన్సీ ముకుందాన్ని ఇండియా నించి అమెరికాకి 'కె' వీసా మీద పిలిపించే విషయంలో మీరు సహాయం చేయడానికి నిరాకరించిన మీదట, ఈ ఆఖరి ఉత్తరాన్ని మీకు రాస్తున్నాను.

ఇంకో తొమ్మిది రోజుల్లోగా ముకుందం అమెరికాకి చేరుకోలేక పోతే మా నాన్నగారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఇక అతన్ని నేను వివాహం చేసుకోలేను.

అదే జరిగితే మానవత్వంతో సహాయం చేయగలిగి ఉండీ మీరు చేయనందుకు ప్రొటెస్టుగా నా జీవితాంతం అవివాహితగానే జీవిస్తాను. కేపిటల్ హిల్ మెట్ల మీద, స్టేసిఎబ్ని తర్వాత అంత తీవ్రంగా ప్రొటెస్టు చేసేది నేనే అవుతాను.

రోజూ ప్రపంచంలోని అన్ని దేశాలనించీ ఎంతోమంది టూరిస్టులు కేపిటల్ హిల్‌కి వస్తూ పోతుంటారు. వారందరికీ తియ్యగా ముగియాల్సిన ఓ ప్రేమ కథని 'బిల్‌క్లింటన్' అనే అమెరికన్ ప్రెసిడెంట్ ఎలా విషాదంగా మార్చాడో నేను బ్రతికున్నంత కాలం చాటి చెప్తాను. ప్రేమికులని విడదీసిన అపకీర్తి మీకు మిగిలిపోతుంది. ఇది బెదిరింపు కాదు. ఆఖరి అభ్యర్థన.

*థాంకింగ్ యు సర్*

**సిన్సియర్లీ యువర్స్**

**వాణి.**

(వాషింగ్‌టన్ యు ఎస్ కాపిటల్ బిల్డింగ్ మెట్లమీద గత పంతొమ్మిది ఏళ్ళగా స్టేసిఎబ్ని అనే వ్యక్తి ప్రొటెస్టు చేస్తూ నివసిస్తున్నాడు.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో పాల్గొన్న ఇతను తనకి అయిన గాయాలకి వందశాతం డిస్ ఎబిలిటీ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరాడు. అందుకు 'అంకుల్ సామ్' ఒప్పుకోకపోవడంతో అది ఇచ్చేదాకా అమెరికన్ లెజిస్లేటివ్ బిల్డింగ్ అయిన క్యాపిటల్ హిల్ మెట్లమీద ప్రొటెస్టు చేస్తూ నివసిస్తున్నాడు.

ఇతనికి యుద్ధానంతరం ఇరవై శాతం డిస్ ఎబిలిటీ రేటింగ్ ఇచ్చి నెలకి నూట అరవై రెండు డాలర్లు మాత్రమే మంజూరు చేసారు.

కానీ తనకి హై బ్లడ్ ప్రెషర్. ఛెస్టు పెయిన్. హృద్రోగం కంటిచూపు లోపించడం లాంటి రోగాలున్నాయని, నెలకి 1730 డాలర్లు ఇవ్వాలని ఇతని వాదం. వెటరన్స్ అడ్మినిస్ట్రేషన్ అందుకు అంగీకరించక పోవడంతో జూన్ 15 1915 టెక్సాస్‌లోని తన అరవై ఎకరాల ఆస్థిని వదిలి (ఎకరం ఖరీదు అయిదువేల డాలర్లు) తను సాధించేదాకా తిరిగిరానని శపథం చేసి వచ్చి ఇక్కడ కాపురం పెట్టాడు. మంచూ, తుఫాను దేన్నీ లెక్కచేయడు, రాత్రులు మెట్లకిందవున్న జాగాలో నిద్రపోతాడు. కేపిటల్ పోలీసులు అతన్ని యాభై ఏడుసార్లు ట్రెస్‌పాసింగ్ నేరం మీద అరెస్టు చేసారు. ఆరు సార్లు శిక్ష పడింది. జైలునుంచి విడుదల అయ్యాక తిరిగి ఆ మెట్లమీదకే చేరుకుంటున్నాడు.

సుప్రీం కోర్టు ఇతని విషయంలో ఓ తీర్పు కూడా ఇచ్చింది. ఫెడరల్ గవర్నమెంట్ ఆస్థిలో పడుకోవడం ఫ్రీ స్పీచ్‌లోని ఓ భాగమని ఇది అమెరికన్ రాజ్యాంగం ఇచ్చిన గ్యారంటీ అని, తప్పులేదని.

పోలీసులు అతన్ని అనిష్టంగానే అరెస్టు చేస్తారు. అక్కడ ప్రెసిడెంట్ స్టేట్ ఆఫ్ ది యూనియన్ ఎడ్రస్ చేసేలాంటి ప్రత్యేక సందర్భాలలో.

టూరిస్ట్‌లు ఇతనికి బట్టలు, భోజనం ఇస్తుంటారు. లోకల్ ఫాస్ట్‌ఫుడ్ జెయింట్స్ తమ బాత్‌రూంలని ఉచితంగా ఉపయోగించడానికి అనుమతి నిస్తున్నారు. అతన్ని అంతా గౌరవంగా ట్రీట్ చేస్తారు. పోలీస్ సైకియాట్రిస్ట్‌లు అతన్ని పరీక్షించి పిచ్చివాడు కాదని నిర్ధారణ చేశారు.

ప్రెసిడెంట్ ఫోర్డ్, కార్టర్, రీగన్, బుష్, క్లింటన్‌లను చూశాడితను)

వాణి ఆ ఉత్తరాన్ని వంద జిరాక్స్ కాపీలు తీసింది. ప్రెసిడెంట్‌కి అంతకు మునుపు రాసిన ఉత్తరాల్ని, తనకి వచ్చిన సమాధానాలనికూడా జిరాక్స్ తీసి వాటిని ప్రెసిడెంట్‌కి రాసిన లెటర్ జిరాక్స్ కాపీలకి జత చేసింది.

అలా పంపే ప్రతి ఉత్తరానికీ తన చేత్తో రాసిన కవరింగ్ లెటర్‌ని జత చేసింది. ఆ విషయాన్ని వార్తగా ప్రచురించి, బ్రాడ్‌కాస్ట్‌చేసి, తనని సపోర్ట్ చేయవలసిందిగా కోరుతూ తన బయోడేటాని కూడా జత చేసింది.

ఉదయం నించి సాయంత్రం దాకా పట్టింది ఈ పనంతా పూర్తవడానికి. మర్నాడు ఉదయం ఒరిజినల్ లెటర్‌ని కొరియర్ సర్వీస్ ద్వారా వైట్‌హౌస్ చిరునామాకు, మిగిలినవి రిజిస్టర్డ్ పోస్ట్‌ద్వారా న్యూయార్క్ టైమ్స్, వాషింగ్టన్ పోస్ట్, హెరాల్డ్ ట్రిబ్యూన్, లాస్‌ఏంజెలెస్ టైమ్స్‌లాంటి నేషనల్ దినపత్రికలకు, ఇంకా అమెరికాలోని అన్ని రాష్ట్రాలనుంచి వెలువడే ప్రాంతీయ దినపత్రికలకు, చిన్నా, పెద్దా రేడియో స్టేషన్స్‌కు, టీవీ స్టూడియోలకు పంపించింది. వాటిలో కొన్నయినా దీన్ని వార్తగా వేస్తాయని ఆశ.

అమెరికాలో స్థిరపడ్డ పది లక్షల మంది ఇండియన్స్ కోసం వెలువడే, కేవలం ఇండియాకి సంబంధించిన వార్తలు మాత్రమే ప్రచురించే ఇండియా ఎబ్రాడ్, ఇండియా మోనిటర్, ఎల్.ఏ ఇండియా, న్యూస్ ఇండియా, స్పాట్‌లైట్, ఇండో అమెరికన్ న్యూస్, ఇండియా వెస్ట్‌లాంటి డజను పత్రికలకు కూడా పంపింది.

ఆ విషయాన్ని రచ్చకెక్కించడానికి కారణం. ఇది తప్ప ఆమెకి వేరే దారి కనపడకపోవడం.

ముకుందం నుంచి ఓ ఏరోగ్రాం వచ్చింది వాణికి. అంత టెన్షన్‌లోనూ అది ఆమెకి చిర్నవ్వు నిచ్చింది.

***రాజమండ్రి***

***డియర్ వాణీ,***

ఇందాకే చదివాను. అమెరికన్ ప్రెసిడెంట్ రోజుకి సగటున 19,689 అడుగులు వేస్తాడని. రాంగ్ డైరెక్షన్‌లో అయుంటాయని.

***లవ్***

***ముకుందం***

ఆ రోజు రాత్రి ఏడున్నరకి ఫోన్ మోగింది. రిసీవర్ అందుకున్న లక్ష్మి చెప్పింది.

"దిసీజ్ చల్లాస్ రెసిడెన్స్ ప్లీజ్."

"మిస్ వాణితో నేను మాట్లాడొచ్చా?" అమెరికన్ ఏక్సెంట్‌తో అడిగిందో మగగొంతు.

"ష్యూర్. మే ఐ నో హూ ఈజ్ కాలింగ్?"

"దిసీజ్ ఫ్రం టెక్సాస్ రేడియో."

"టెక్సాస్ రేడియో?" ఆశ్చర్యంగా అడిగింది.

"యు గాటిట్ రైట్"

లక్ష్మి వాణికి రిసీవరు అందించింది.

"దిసీజ్ వాణి" చెప్పింది వాణి.

"నాకు మీ ఉత్తరం అందింది. మొత్తం పరిశీలించాక ఓ అయిదునిముషాలు టెలిఫోనిక్ ఇంటర్వ్యూ చేద్దామనుకున్నాం. ఆర్ యూ రెడీ?"

"ఐ యామ్ రెడీ సర్"

"మీరు చెప్పేది సరిగ్గా నిముషం తర్వాత బ్రాడ్‌కాస్ట్ అవుతుంది. ఈ నిముషం గేప్ బ్రాడ్ కాస్ట్ కావడానికి రూల్స్ ప్రకారం వీల్లేని విషయాలేమయినా వుంటే ఎడిట్ చేసి తీయడానికి. ముకుందాన్ని మీరు ఆఖరి సారి ఎప్పుడు చూశారు?"

"దాదాపు ఆర్నెల్ల క్రితం"

"ఆర్నెల్ల గడువు తర్వాత 'కె' వీసా మీద అతను వస్తే అప్పుడు అతన్ని వివాహం చేసుకోవడానికి ఏమిటి మీకు అభ్యంతరం?"

"మా నాన్నగారు అమెరికన్ సిటిజనే అయినా, ఆయనది ఇండియన్ మెంటాలిటీ. అక్కడ మాకు పెద్దలు కుదిర్చిన వివాహాలు తప్ప అమెరికాలోలా ఎవరికివారు జీవిత భాగస్వామిని ఎన్నుకునే సంప్రదాయం లేదు. కులేతరులని చేసుకోవడం ఇండియన్స్‌కి టేబూ. అందుకని ఈ ఆర్నెల్ల పీరియడ్ విధించారు. ఈలోగా ముకుందం అమెరికా వస్తే మాది పెద్దలు కుదిర్చిన వివాహం అవుతుంది. లేదా కాదు."

"మీ జీవిత భాగస్వామిని వాళ్ళతో ప్రమేయం లేకుండా మీరే చేసుకోవచ్చుగా?"

"వ్యక్తిగతంగా నాకు ఎవర్నీ చేసుకోవడానికి అభ్యంతరంలేదు. చైనీస్, వ్యూర్టోరికన్, జపనీస్, రష్యన్, మెక్సికన్ ఎవరయినా నాకొకటే. నేనతన్ని ప్రేమిస్తే, మా తల్లిదండ్రుల అభీష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకుని మా కుటుంబ సభ్యులచేత వెలివేయబడటం నాకిష్టం లేదు."

"వెలివేయబడటం అంటే?"

"నన్ను వాళ్ళింటికి రానివ్వరు. మా ఇంటికి వారు రారు. శుభానికి, అశుభానికి కానీ ఇతరత్రా కానీ నేను వాళ్ళ వరకు నాన్ ఎంటిటీ అవుతాను."

"అది బాధాకరమయిన విషయమే. అయినా మీరు పోట్లాడేది అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తితో. మీరు గెలవగలనని అనుకుంటున్నారా?"

"నిజానికి నా గెలుపు బిల్ క్లింటన్ గెలుపు. నా ఓటమి అతని ఓటమి అవుతుందనుకుంటున్నాను."

"అది వివరించగలరా?"

"నేను గెలిచి ముకుందం ఇంకో ఏడురోజుల్లోగా అమెరికాకు రాగలిగితే, ప్రేమికుల్ని కలిపిన ఖ్యాతి తెచ్చుకోవడం బిల్ క్లింటన్ గెలుపు. అందుకు సహకరించక, నేను ప్రొటెస్ట్‌గా కేపిటల్ హిల్స్ మెట్లమీదకి వెళితే, అది క్లింటన్ ఓటమి. ప్రేమికుల్ని విడదీసిన నిందమోయడం నా ఉద్దేశంలో ఓటమే అవుతుంది."

"ఒకవేళ మీరు ఓడితే కేపిటల్ హిల్ మెట్ల మీదకి నిజంగా వెళతారా?"

"అదే జరిగితే నా తర్వాతి ఇంటర్వ్యూ అక్కడి నుంచి ప్రసారం చేయండి"

"ప్రేమికుడి మీద, మీ కుటుంబ సభ్యుల మీద మీకున్న గాఢమైన అనుబంధానికి మేమంతా ఎంతో స్పందించి ఈ ఇంటర్వ్యూని చేయాలనుకున్నాం. మీకు విజయం కలగాలని టెక్సాస్ రేడియో తరపున నా శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను."

"థాంక్ యూ.. థాంక్ యూ వెరీమచ్" ఫోన్ పెట్టేసి వాణి తల తిప్పి చూస్తే, ఆమె సంభాషణ విని తెల్లబోతూ చూస్తున్న కుటుంబ సభ్యులు కనిపించారు.

"టెక్సాస్ రేడియో దేని గురించి ఇంటర్వ్యూ చేశారు?"

జవాబు చెప్పలేదు వాణి.

"సమ్ థింగ్ ఫన్నీ ఈజ్ సర్టెన్లీ గోయింగ్ ఆన్. ఐ కెన్ సెన్స్ దట్" చెప్పింది పావని.

"ఇటీజిన్ట్ ఫన్నీ. ఇటీజ్ డిసాస్ట్రస్" చిన్నగా నవ్వుతూ చెప్పింది వాణి.

సేనోజే లోకల్ రేడియో స్టేషన్ కె.ఆర్.టి.వై వారు, వాణి ఆ ఏరియాలో ఉండే లోకల్ గర్ల్ కాబట్టి, శ్రోతలకి ఆసక్తిగా ఉంటుందని వాణి రాసిన ఉత్తరాలని సమగ్రంగా వార్తగా రాసి, దాన్ని న్యూస్ బ్రాడ్‌కాస్ట్‌లో చేర్చారు.

అలాగే శాన్‌ఫ్రాన్సిస్కోలోని రేడియో స్టేషన్ కె.ఏ.ఎస్.ఎన్ కూడా దాన్ని తాము వార్తల్లో చేర్చింది. ఆ వార్తలు బ్రాడ్ కాస్ట్ అయ్యాక బే ఏరియా తెలుగు అసోసియేషన్‌కి చెందిన ఇద్దరు తెలుగువాళ్ళు లక్ష్మికి ఫోన్ చేసి తాము విన్నది నిజమేనా అని అడిగారు.

లక్ష్మి వెంకటేశ్వరరావుకి చెప్పిందా విషయం. ఆయన వాళ్ళకి ఫోన్ చేసి వాళ్ళు ఏం విన్నారో అడిగి తెలుసుకున్నాడు.

"ఇడియట్! ఏ ఫైన్ ఇడియట్ వాణీ ఈజ్" కోపంగా అరిచాడాయన.

"ఇక్కడి తెలుగువాళ్ళలో మన పరువు పోయింది. ఇప్పుడెలా?" అడిగింది లక్ష్మి ఆందోళనగా.

"అదికాదు నా భయం. ప్రెసిడెంట్ కల్పించుకుని ముకుందానికి వీసా మంజూరు చేసే ఏర్పాటు చేస్తాడని నా భయం" చెప్పాడాయన.

లక్ష్మి కోపంగా వెళ్ళి అడిగింది వాణిని.

"నిన్ను నరికి పోగులు పెట్టినా పాపం లేదు. ఎందుకు నన్నూ, నాన్నగారిని వీధిలోకి ఈడ్చావ్?"

"నా ప్రయివేట్ లైఫ్‌ని మెడిల్ చేసినందుకు"

"ఛీ..ఛీ.. నిన్ను కాకినాడలో పడేసి వచ్చినా బాగుండేది."

"సేనోజే కన్నా రాజమండ్రికి కాకినాడ దగ్గర. మీరు అలా చేసినా బావుండేది" చెప్పింది వాణి.

న్యూయార్క్‌లోని ఓ రేడియో స్టేషన్ వారు వాణి పంపినది చదివి అది 'హ్యూమన్ ఇంట్రస్ట్ స్టోరీ'గా శ్రోతలకు ఆసక్తిగా ఉంటుందని భావించారు. న్యూయార్క్ రాష్ట్రంలో లక్షన్నర మందికి పైగా ఇండియన్స్ వున్నారు.

ఆ కారణంగా వాళ్ళు వాణి స్టోరీతోపాటు ఆమె ఇంటర్వ్యూను కూడా ప్రసారం చేశారు. శ్రోతల కోరిక మీద దాన్ని నాలుగు గంటల తర్వాత పునఃప్రసారం చేశారు.

ఫ్లోరిడా రాష్ట్రంలోని ఓ రేడియో స్టేషన్ దాన్ని 'బి జేర్ టీనేజ్ లవ్ స్టోరీ'గా వాల్యూచేసి ప్రసారం చేశారు. మొంటానాలో వున్న ఇండియన్స్ మూడువందల లోపే అయినా ఆ రాష్ట్రంలోని ఓ రేడియో స్టేషన్ ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా ఇన్‌వాల్వ్ అయి ఉండటంతో వాణి వార్తకి ప్రాముఖ్యాన్నిచ్చి ప్రసారం చేశారు. దాంతోపాటు గతంలో వాళ్ళు ప్రసారం చేసిన స్టేసిఎబ్బి టేప్‌ని పునఃప్రసారం చేశారు.

దినపత్రికలలో ఆ వార్తని ప్రచురణకి అర్హంగా భావించింది. మొదటగా వాషింగ్‌టన్ హెరాల్డ్ వాళ్ళకి వివిధ రాష్ట్రాల్లోని స్ట్రింగర్స్‌నించి, రేడియోలో విన్న ఆ వార్త తాలుకు ఫేక్స్‌లు అందాయి. దాంతో వాళ్ళు అరకాలం స్టోరీని నాలుగోపేజీలో రన్ చేయదలచుకున్నారు.

న్యూయార్క్ టైమ్స్ న్యూస్ ఎడిటర్ ఆ వార్త ప్రాముఖ్యాన్ని సరిగ్గా పసికట్టాడు. ఎడిటర్స్ మీటింగ్‌లో దాన్ని అపోజ్ చేసిన వారికి చెప్పాడు.

"హియర్ ఈజ్ ఏ రియల్లీ గుడ్ స్టోరీ. దీంట్లో సేలబుల్ న్యూస్‌కి కావలసినవన్నీ వున్నాయి. లవ్‌స్టోరీ, ఇమ్మిగ్రేషన్, టైం ఎలిమెంట్ వల్ల సస్పెన్స్, హ్యూమన్ ఇంట్రెస్టు. అన్నిటికీ మించి బిల్ క్లింటన్ కూడా వున్నాడు. సిడ్నీ షెల్డన్ ఉడ్ లవ్ టు యూజ్ ఇట్, ఐ బెట్."

ఆ రాత్రి పదకొండున్నరకి వాణికి ఫోన్ కాల్ వచ్చింది న్యూయార్క్ టైమ్స్ రిపోర్టర్ నించి.

"మీ ఫోటోగ్రాఫ్ కావాలి. వచ్చి తీసుకెళ్ళచ్చా?"

"న్యూయార్క్ టైమ్స్" వాణి గుండె క్షణకాలం లయ తప్పింది. "యూ ఆర్ వెల్‌కమ్ మిస్టర్ మెకెంజా" చెప్పింది.

అతనొచ్చి ఫోటో తీసుకెళుతుంటే వెంకటేశ్వరరావు, లక్ష్మి నిస్సహాయంగా చూశారు.

మర్నాడు ఉదయం లెక్కలేనన్నిసార్లు వెంకటేశ్వరరావు ఇంట్లో ఫోన్ మోగింది. గతంలో వాళ్ళు వున్న న్యూజెర్సీలోని హైట్స్‌టోన్ నించి, లాంగ్ ఐ లాండ్‌లోని డీర్‌పార్క్ నుంచి, వర్జీనియాలోని ఫాల్స్ చర్చ్ నుంచి, ఇల్లినాయిస్‌లోని లాంగగ్రోవ్ నించి, సెయింట్ లూయీనించి వాళ్ళంతా గతంలో వెంకటేశ్వరరావు ఆ ప్రాంతాల్లో వున్నప్పుడు ఫ్రెండ్స్.

ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికాకి తను పంపిన అప్పీల్‌ని పెడ చెవిన పెట్టడంతో, తను తీసుకున్న నిర్ణయానికి అంత పబ్లిసిటీ, అంత ప్రాముఖ్యము వస్తాయని వాణి ఊహించలేదు.

Post your comments

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in